క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా సోమవారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ఈ కింది ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని డీఈ హన్మంత్‌రావు తెలిపారు.
- ఎస్‌బీఐ కాలనీ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 వరకు, శాలివాహన నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ సరఫరా ఉండదన్నారు.
- జయానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

యుద్ధప్రాతిపదికన స్ట్రీట్ లైట్లకు మరమ్మతులు

వనస్థలిపురం: జీహెచ్‌ఎంసీ నూతన కమిషనర్ రోనాల్డ్ రోస్ ఆదేశాల మేరకు ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ ఆధ్వర్యంలో జోన్‌లోని వివిధ కాలనీల్లో శుక్ర, శనివారాల్లో ఎలక్ట్రికల్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వెలగని 1600 స్ట్రీట్ లైట్లను గుర్తించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. అదే విధంగా ఆన్‌లైన్‌లో స్ట్రీట్‌లైట్లపై వచ్చిన 180 ఫిర్యాదులను పరిష్కరించారు. స్పెషల్ డ్రైవ్‌లో ఈఈ బి.పున్నానాయక్, డీఈలు రవీంద్ర, శ్రీనివాస్, ఏఈలు ప్రత్యూష, ప్రసాద్, జగన్నాథం పాల్గొన్నారు.

హస్తినాపురంలోని సమస్యలు పరిష్కరించాలి

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని బీఎస్పీ ఎల్‌బీనగర్ నియోజక వర్గ ఇన్‌చార్జ్ జక్క యాదగిరి డిమాండ్ చేశారు. ఆదివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న శ్రీరమణకాలనీ, భీమానగర్‌కాలనీ, శ్రీరామ అయోధ్యనగర్ కాలనీ, ఇంద్రప్రస్థకాలనీలలో ఆయన పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ, అసంపూర్తిగా ఉన్న రోడ్లన్నీ పూర్తి చేయాలన్నారు. డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న పార్కుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనగల్ల స్వామి, అనిల్‌యాదవ్, ఎర్ర అశోక్, మోకురోజు సత్యం, ఏడుకొండలు, శివ పాల్గొన్నారు.

న్యాయవాది ఇంటిపై పోలీసుల దాడి

సైదాబాద్: వివాదంలో ఉన్న భూమి విషయమై నిందితుల కోసమని న్యాయవాది ఇంటిపై పోలీసులు దాడి చేసారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి... మహబూబాబాద్ జిల్లా గూడూరు పీఎస్ పరధిలోని 5 ఎకరాల స్థలంపై వివాదం నెలకొని ఉంది. ఈ స్థలం విషయమై ఎన్‌ఆర్‌ఐ ఏపూరి సుభాష్‌రెడ్డి ఆదివారం సాయంత్రం మలక్‌పేటలోని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ కార్యాలయంలో చర్చిస్తున్నారు. అదే సమయంలో గూడూరు పీఎస్ ఎస్‌ఐ సిబ్బందితో అక్కడికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించడంతో వివాదం నెలకొంది. 41 సీఆర్‌పీఎస్ ఇవ్వకుండా ఎన్‌ఆర్‌ఐను అక్రమంగా అరెస్ట్ చేయడానికి గూడూరు పోలీసులు ప్రయత్నించారని సోమవారం డీజీపీకి ఫిర్యాదు చేస్తామని అడ్వకేట్ రాపోల్ భాస్కర్ మీడియాకు తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనంలో మేయర్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ రఘుహోమ్స్ కాలనీ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో..

ఆదివారం 10వ డివిజన్‌లోని ఇందిరానగర్ కాలనీలో బడంగ్‌పేట నగర పంచాయితీ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి పర్యటించారు.

ఆదాయం ఫుల్.. సౌకర్యాలు నిల్!

- ఇరుకైన అద్దె భవనం
- కూర్చోవడానికి కుర్చీలు, తాగునీరు, పార్కింగ్ సదుపాయం కరువు
- తరచూ మొరాయిస్తున్న సర్వర్లు
- రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారికి తప్పని అవస్థలు
- చంపాపేట సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసులోని దుస్థితి ఇదీ



రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారితో కిటకిటలాడుతున్న చంపాపేట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం



లోపల చోటు లేక బాల్కనీలో నిలబడ్డ వైనం

చంపాపేట: కొన్ని రోజుల నుంచి నగర, శివారు ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకుంది. భూములు, ప్లాట్లు, ఇళ్ల క్రయవిక్రయాలు పెరగడంతో నిత్యం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు (ఎస్‌ఆర్‌ఓ) రద్దీకి నిలయాలుగా మారుతున్నాయి. దీనికి తోడు నెలలో ఆరేడు రోజులు సర్వర్లు మొరాయించడంతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఫలితంగా రద్దీ మరింత పెరుగుతోంది. అయితే, ఎస్‌ఆర్‌ఓలలో సరైన సదుపాయాలు లేకపోవడంతో రిజిస్ట్రేషన్ పనులపై వచ్చేవారు నానా అవస్థలు పడుతున్నారు. దీనికి చంపాటలోని సబ్ రిస్ట్రేషన్ కార్యాలయమే నిదర్శనం. ఇక్కడ ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల ద్వారా ఆదాయం ఎక్కువగా వస్తున్నప్పటికీ రిజిస్ట్రేషన్ కోసం వచ్చేవారికి ఇక్కడ కనీస వసతులు లేక నానా అవస్థలు పడుతున్నారు.
- చంపాపేట చౌరస్తాలో ఓ పాత భవనంలోని మొదటి అంతస్తులో 16 ఏళ్ల క్రితం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలయాన్ని అధికారులు ఏర్పాటు చేశారు.
- ఈ ఎస్‌ఆర్‌ఓ పరిధిలో సరూర్‌నగర్, బాలాపూర్ మండల పరిధిలోని చంపాపేట, సుల్తాన్ అల్వా, తుమ్మలకుంట, బాలాపూర్, గుర్రంగూడ, కొత్తపేట జల్‌పల్లి, మామిడిపల్లి, వెంకటాపూర్, నాదర్‌గూల్ తదితర గ్రామపంచాయతీలు, నగర పంచాయతీలు ఉన్నాయి.
- ఆయా గ్రామాల్లో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి బాటలో నడుస్తుండటంతో స్థలాలు, కొత్త, పాత ఇళ్ల, క్రయ విక్రయాలు ఎక్కువగా ఉంటున్నాయి. నిత్యం క్రయ, విక్రయదారులు, సాక్షులతో రిజిస్ట్రేషన్ కార్యాలయం కిటకిటలాడుతోంది.
- మూడు ఇరుకు గదులుల్లో కొనసాగుతున్న ఈ కార్యాలయంలో కూర్చోవడం అటుంచి.. కనీసం నిలబడేందుకు కూడా చోటు లేకపోవడంతో వివిధ పనులపై వచ్చేవారు కార్యాలయం బాలక్నీలోనే నిలబడాల్సి వస్తోంది.
- ఇక సర్వర్లు మొరాయిస్తే జనం రద్దీతో మరింత పెరిగిపోయి కార్యాలయంలో ఊపిరాడని పరిస్థితి నెలకొంటోందని చంపాపేట రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వచ్చేవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- కార్యాలయంలో టాయిలెట్స్, వాహన పార్కింగ్ సదుపాయం వంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇక్కడికి వచ్చేవారు నానా అవస్థలు పడుతున్నారు.
- ఇకనైనా రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ఉన్నతాధికారులు చంపాపేటలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని వెంటనే వెయింటింగ్ రూమ్, టాయిలెట్స్, పార్కింగ్ వంటి సదుపాయాలు కలిగిన విశాలమైన భవనంలోకి మార్చడంతో పాటు సర్వర్లు సమర్థవంతంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని భూ క్రయ, విక్రయదారులు కోరుతున్నారు.

అక్రమ పార్కింగ్‌లతో ట్రా'ఫికర్'

రిజిస్ట్రేషన్ కోసం వచ్చేవారు తమ వాహనాలను ప్రధాన రహదారిపై పార్కింగ్ చేయటంతో నిత్య చంపాపేట చౌరస్తాలో ట్రాఫిక్ జామ్ కావడంతో పాటు తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కార్యాలయాన్ని వెంటనే వేరే ప్రాంతానికి మార్చాలని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ పరిసర కాలనీల ప్రజలు కోరుతున్నారు.

నూతన భవనంలోకి మార్చాలి



సుమారు 15 ఏళ్లుగా పురాతన భవనంలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం కొనసాగుతోంది. టాయిలెట్స్, కూర్చునేందుకు కుర్చీలు, తాగునీరు, వాహన పార్కింగ్ వంటి సదుపాయం లేకపోవడంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చేవారు అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ కార్యాలయాన్ని అన్ని సదుపాయాలు కలిగిన నూతన భవనంలోకి మార్చాలని కోరుతున్నా.

– భానుక రమేష్, చంపాపేట

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధి ఎఫ్‌సీఐ కాలనీలో లక్ష్మి ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని ప్రారంభించిన స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, ఇటువంటి వైద్య శిబిరాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మోకాళ్లు, నడుము నొప్పులు, పక్షవాతం,ఆస్తమా, చర్మవ్యాధులు, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఎండీ వై.శ్రీనివాసులు, డాక్టర్లు నిఖిత, నవీన్‌కుమార్, కాలనీ అధ్యక్షుడు సిరిగిరి రాంరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపుకు కృషి చేయాలి



భట్టి విక్రమార్కను కలిసిన కాంగ్రెస్ నాయకులు

చాదర్‌ఘాట్: తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాస్‌లు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేసినందుకు ఆయనకు వారు అభినందనలు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలి



పెద్ద చెరువు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, అప్పుడే అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు మెరుగు పడటమే కాకుండా త్వరితగతి పనులు పూర్తవుతాయని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని పెద్దచెరువు పనులను పరిశీలించి, పవనగిరి కాలనీ ఫేజ్–3 కాలనీవాసులతో కలిసి తేనేటి విందులో పాల్గొన్నారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పవనగిరి కాలనీ ప్రతినిధులు హరినాథ్, సంపత్, శ్రీనివాస్‌రెడ్డి, పీవీ రావు, ప్రభాకర్‌రెడ్డి, నరసింహుడు, కోటేశ్వరరావు, శ్రీకాంత్, పాషా, శేఖర్‌రెడ్డి, స్వప్న, నాయకులు కడారి యాదగిరియాదవ్, పాతూరి శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

డబ్బులు కట్టకుంటే గోడలు కూల్చేస్తారా?

కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్: జీఓ 59 కింద దరఖాస్తు చేసుకున్న పేదలు ప్రభుత్వం చెల్లించమన్నంత డబ్బు చెల్లించలేదని, వారి ఇళ్లను అధికారులు కూల్చివేయడం అన్యాయమని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని పద్మావతి కాలనీలో 59 జీఓ కింద డబ్బులు చెల్లించకపోవడంతో ఇంటి ప్రహరీని అధికారులు కూల్చివేశారు. ఆదివారం బీజేపీ రంగారెడ్డిజిల్లా (అర్బన్) అధ్యక్షుడు సామ రంగారెడ్డితో కలిసి కార్పొరేటర్... అధికారులు కూల్చిన ప్రహరీ ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 20 ఇళ్ల క్రితం నిర్మించుకున్న ఇంటికి రూ.13 లక్షలు చెల్లించాలని నోటీసులు ఇచ్చారని, ఇళ్ల రెగ్యులరైజేషన్ పేరుతో ప్రభుత్వం పేదల నుంచి లక్షల రూపాయలు వసూలు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఈ దోపిడీని అడ్డుకొని, పేదలకు అండగా నిలబడతామని నవజీవన్ రెడ్డి అన్నారు.

రెడ్డి బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి



బస్తీ సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని రెడ్డి బస్తీలో నెలకొన్న మౌలిక సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు ఆదివారం ఆయన రెడ్డి బస్తీ, చంపాపేట ఓల్డ్ బస్తీల్లో పాదయాత్ర చేశారు. కాలంచెల్లి కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, శిథిలావస్థకు చేరిన పురాతన భవనాలు, మోడల్ మార్కెట్‌లో భూగర్భ డ్రైనేజీ సమస్య వంటివి పరిశీలించారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి కూలేందుకు సిద్ధంగా ఉన్న పురాతన భవనాలను వెంటనే కూల్చేయాలని, కాలం చెల్లిన ఇనుప విద్యుత్ స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం రెడ్డి బస్తీలో పక్షవాతంతో బాధపడుతున్న లక్ష్మయ్యను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు సందీప్‌రెడ్డి, దశరథగౌడ్, అవినాష్‌రెడ్డి, యోగిరాజ్, రాజేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని కలిసిన మూసారంబాగ్ కార్పొరేటర్



కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి

మలక్‌పేట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కిషన్‌రెడ్డిని ఆదివారం మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మలక్‌పేటలో బీజేపీకి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేయాలని కిషన్‌రెడ్డి సూచించారని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గౌర దేవేందర్, సురేందర్, దినేష్, సంతోష్, ప్రభు, తదితరులు ఉన్నారు. అలాగే, భాగ్యనగర్ జిల్లా పార్టీ కోశాధికారి తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తా: ఎమ్మెల్యే



సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాల్లో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నిర్వహించిన మన్సూరాబాద్ డివిజన్‌లోని వివిధ కాలనీల సంక్షేమ సంఘం సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కాలనీవాసులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ప్రధాన సమస్యలను పరిష్కరించారని, మిగిలిన చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను దాదాపు నెరవేర్చామని, ఇంకా చేయాల్సి ఉందన్నారు. ఎల్బీనగర్‌ను ఇంకా అభివృద్ధి పర్చాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, కర్మన్‌ఘాట్ హనుమాన్‌టెంపుల్ మాజీ చైర్మన్ ఈశ్వరమ్మయాదవ్, సీనియర్ నాయకులు కుంట్లూరు వెంకటేశ్‌గౌడ్, టంగుటూరు నాగరాజు, జగదీశ్‌యాదవ్, జక్కిడి రఘువీర్‌రెడ్డి, రుద్ర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సర్వ్ సేవా సంఘ్ భవన్ కూల్చివేతను ఉపసంహరించుకోవాలి



సింగరేణికాలనీలో సత్యాగ్రహదీక్ష చేస్తున్న సర్వోదయ మండలి సభ్యులు

సైదాబాద్: గాంధీజీ ఆలోచనలు వ్యాప్తి చేయడానికి వారణాసిలో జాతీయ నాయకులతో స్థాపించబడిన సర్వ్ సేవా సంఘ్ భవన్‌కూల్చివేయాలని ప్రభుత్వాలు నిర్ణయించడం గాంధీజీ వారసత్వంపై దాడి చేయడమే అని ప్రముఖ గాంధేయవాది డాక్టర్ మోటూరి కృష్ణప్రసాద్ అన్నారు. చారిత్రాత్మకమైన సంఘ్ భవన్ కూల్చివేత ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని గిరిజన సమాఖ్య కార్యాలయంలో సంఘం సభ్యులు సత్యాగ్రహదీక్ష చేపట్టారు. దీక్షలో పాల్గొన్న కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, ఆచార్య వినోభా బావే నిర్మించిన భవనాన్ని కాశీ కారిడార్ విస్తరణలో భాగంగా యూపీలోని బీజేపీ ప్రభుత్వం రైల్వేశాఖకు అప్పగించాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. శాంతియుత ఉద్యమాలు, న్యాయపోరాటం ద్వారా కూల్చివేతలను అడ్డుకుంటామని ఆయన అన్నారు. సత్యాగ్రహదీక్షలో తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.శంకర్‌నాయక్, షేక్ మహమూద్, అమీనా, రమేష్, పాండు, అంజయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో మౌలిక వసతులు కరువు: సామ



శ్రీనివాసపురంలో బీజేపీ పథకాలను వివరిస్తున్న సామ రంగారెడ్డి తదితరులు

వనస్థలిపురం: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 ఏళ్లైనప్పటికీ ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఇంకా కాలనీలలో మౌలిక సదుపాయాలు ఏర్పడలేదని, కాలనీలలో ముంపు, డ్రైనేజీ తదితర సమస్యలు అలాగే ఉన్నాయని బీజేపీ రంగారెడ్డి జిల్లా (అర్బన్) అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన వనస్థలిపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాసపురం, శ్రీ శ్రీనివాసపురం, క్రిస్టియన్ కాలనీ, నాగార్జున కాలనీలలో పాదయాత్ర నిర్వహించి కేంద్ర ప్రభుత్వ పథకాలను కాలనీవాసులకు వివరించారు. అలాగే బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను వారి దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో నాయకులు నూతి శ్రీనివాస్, కొత్త రవిందర్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, టి.విజయ్‌కుమార్, అంజన్‌కుమార్, చిన్నాయాదవ్, రేవతి, బుచ్చిరెడ్డి, లక్ష్మణ్, ప్రశాంత్‌రెడ్డి, వీరస్వామిగౌడ్, భార్గవ్‌తేజ, రోజారమణి, జి.శ్రీనివాస్‌రెడి పాల్గొన్నారు.

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 119 స్థానాల్లో ప్రజాపార్టీ పోటీ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అజయ్‌కుమార్ యాదవ్

వనస్థలిపురం: తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా పార్టీ 119 అసెంబ్లీ స్థానాలలో పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం వనస్థలిపురం డివిజన్ యశోదనగర్ కాలనీలోని ప్రజా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, ప్రజా పార్టీ బీసీలకు 70 అసెంబ్లీ స్థానాలను కేటాయిస్తుందని, అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామని అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేస్తున్నాయని, ఆ పార్టీలకు బీసీని ముఖ్యమంత్రి చేసే దమ్ము ఉందా అని అజయ్‌కుమార్ ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెంట రమేష్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంజి యాదవ్, నాయకులు భాగ్యలక్ష్మి, సతీష్‌యాదవ్, మహేష్‌యాదవ్, ఈశ్వర్, రాములు, ప్రశాంత్, నాగప్ప, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మధుసూదన్ గుప్తా

హస్తినాపురం: ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ వైద్యపరీక్షలు చేయించుకొని సంతోషంగా జీవించాలని ఆర్యవైశ్య సంఘం హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు నీళ్ల మధుసూదన్‌గుప్తా అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధి లోని డీఆర్‌డీఎల్ కాలనీలో కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు తరలివచ్చి వైద్యపరీక్షలు చే యించుకున్నారు. కాలనీవాసులు బిజ్జాల వేణుగుప్తా, బండారు సుధాకర్‌గుప్తా, యాదగిరిగుప్తా, పీఆ ర్ఓ వెంకటేశ్వర్లు, సముద్రాల ఆంజనేయులు, మరియాల రాజు, రవీందర్, బూర్గు వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా హరిబాబు



హరిబాబుకు నియామకపత్రం అందజేస్తున్న మేడి పాపయ్య

నాగోలు: తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శిగా కొత్తపేటకు చెందిన బాజపల్లి హరిబాబు మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌లు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. భవిష్యత్‌లో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం, జాతి అభివృద్ధి కోసం జరిగే పోరాటంలో తన వంతు పాత్ర ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ నాయకులు జీడీ నర్సింహ, సంగపాక యేసోబ్, మంద జయన్న, వేముల సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



మన్సూరాబాద్‌లో ... బోనాల ఉత్సవంలో పాల్గొన్న ఎమెల్యేల్యే సుధీర్‌రెడ్డి



మన్సూరాబాద్‌లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్: మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో ఆదివారం కుమ్మర్ల తొలి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి పూజలు చేశారు. డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి జాతరలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొని పూజలు చేశారు.



బోనం ఎత్తుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మహాలక్ష్మీనగర్ కాలనీలో..

చంపాపేట: డివిజన్ పరిధిలోని మహాలక్ష్మీనగర్ కాలనీలోని అమ్మవారి ఆలయంలో జరిగిన బోనాల వేడుకల్లో బీఎన్‌రెడ్డి డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. నాయకులు సంతోష్‌రెడ్డి, సుమంత్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు యాదయ్య, రాకేష్, రాజు, బాలాజీ, యశోద, కృష్ణ, ఉపేందర్ పాల్గొన్నారు.

మలక్‌పేట మార్కెట్‌లో..

చాదర్‌ఘాట్: మలక్‌పేట మార్కెట్‌లోని నవదుర్గా మాతా ఆలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో వంజరి వినోద్, అఖిల హైదరాబాద్ హమాలీ సంఘం చైర్మన్ చేగూరి వెంకటరమణ, సత్యలింగం, ఉమా శంకర్, శేఖర్, సురేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



వేడుకలకు హాజరైన కార్పొరేటర్ లచ్చిరెడ్డి



అమ్మవారి ఆలయంలో పూజల్లో పాల్గొన్న వంజరి వినోద్